



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## మాజీ మంత్రి కాకాణిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి



**కావలి, జూన్ 13, ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్చార్జ్, కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాజీ మంత్రి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఇటీవల కాలంలో కావలి నియోజకవర్గంలో గత రెండేళ్ల కాలంలో జరిగిన, జరుగుతున్న కూటమి ప్రభుత్వ వైఫల్యాల గురించి, అక్రమ గ్రావెల్ తరలింపు గురించి,వైఎస్సార్సీపీ కార్యకర్తలపై పెడుతున్నటువంటి అక్రమ కేసుల గురించి చర్చించడం జరిగింది.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్ 13, ప్రభాతవార్త** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తి సామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 41.730టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 3300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 94.576 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## మీలా దోచుకోవడానికి రాలేదు.. సేవ చేసేందుకే రాజకీయాల్లోకి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ ప్రజలు ఎంతో చైతన్యవంతులని, అందుకే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తిని తరిమి వేసి 55 వేల మెజార్టీతో తనను తనపై ఉన్న అభిమానంతో గెలిపించారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. వీపీఆర్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి దోచుకోవడం.. దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. తాము ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామే తప్ప మీలా దోచుకోవడానికి రాలేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నీలాంటి కుహన రాజకీయాలు చేయడం తమకు చేతకాదన్నారు. ఇప్పటికే కోవూరు ప్రజలు నిన్ను తరిమివేశారని, మరలా నీవు ఎమ్మెల్యే అయ్యేది గగనమే అన్నారు. అసలు పార్టీ నీకు టిక్కెట్ ఇస్తుందో లేదో ముందు అది తెలుసుకోవాలన్నారు. పని పాట లేక వెన్నుపోటు పేరుతో సంస్కారం లేకుండా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. మా గృహం వచ్చే కార్యకర్తలకు, నాయకులకు సరిపోక పెద్దస్థాయిలో కార్యాలయం కట్టుకున్నామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జరుగుతున్న అన్ని కార్యక్రమాలు పార్టీలకు అతీతంగా చేస్తున్నాము తప్ప వేరేది లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేశామని, కోవూరులో 14 ఎకరాలతో ఎంఎస్ఎంఈ పార్కు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 30 సంవత్సరాలుగా మూలబడి ఉన్న కిసాన్ సెజ్‌కు తిరిగి కొత్త రూపు తెస్తున్నామన్నారు. 15 వేల కోట్లతో ఈ సెజ్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో పరిశ్రమలు రానున్నాయన్నారు. నీలాగా నీ దగ్గర ఉన్న నాయకులను నీవు నమ్మవని జగమంతా తెలుసన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా 10 కోట్ల మేర నియోజకవర్గంలో అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అవాకులు చవాకులు మానుకోవాలని హితవు చెప్పారు. సర్వేపల్లిలో అయిపోయింది.. కోవూరుకు వచ్చారు ఇప్పటి దాకా సర్వేపల్లిలో మాట్లాడి మాట్లాడి అలసిపోయి కోవూరుకు వచ్చిన మాజీ మంత్రి వీపీఆర్ దంపతులపై ఇష్టానుసారంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని హితవు చెప్పారు. నోరు ఉంది కదా అని ఇష్టానుసారంగా మాట్లాడితే రెండవ సారి కూడా ప్రజలు బుద్ధి చెప్పే రోజు ఉందన్నారు. ఎంపీ దగ్గర భిక్ష తీసుకున్న మీరు ఈ విధంగా మాట్లాడడం ప్రజలందరికీ ఎరుకేనన్నారు. ఆయన మంత్రిగా ఉన్న రెండేళ్లలో ఏనాడు అయినా నిన్ను అప్పటి ఎమ్మెల్యే కోవూరుకు రానిచ్చాడని ఎద్దేవా చేశారు. జిల్లాలో నిన్ను ఎవరూ పిలవరని, ఏదో కోవూరుకు నల్ల చొక్కాలు వేసుకుని వచ్చి సభ్యతా సంస్కారాలు మరిచి మాట్లాడడం నీకు తగదన్నారు. ఇప్పటికైనా ఇటువంటి మాటలు కట్టిపెట్టి ప్రభుత్వం చేస్తున్న మంచిని మెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలోకి 20కుటుంబాలు



**కావలి, జూన్ 13 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై స్థానిక 15వ వార్డుకు చెందిన 20కుటుంబాలు శనివారం మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, బిట్రగుంట వెంకట్రావు ఆధ్వర్యంలో పసుపులేటి సుధాకర్ అనుచరులు వల్లెపు తిప్పరాజు, వల్లెపు శ్రీనివాసులు, వల్లెపు తిరుపతిరావు, వల్లెపు నవీన్, వల్లెపు ప్రసాద్, బెల్లకొండ బలరాం, వల్లెపు రాజు, ఉప్పు ఏడుకొండలు, దేవర్ల శీను తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరడం జరిగింది. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోరాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ప్రజల సంక్షేమం మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాలు పెంపు, పారదర్శక పాలన వంటి అంశాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చూసి ప్రజలు స్వచ్ఛంగా టిడిపి పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ప్రజల విశావసమే టిడిపికి బలం అని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారందరికి తగిన గుర్తింపుప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇకపై అందరూ కలిసి కావలి అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

- జూన్ 17న నార్త్ రాజుపాలెంలో మెగా జాబ్ మేళా
- సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు
- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థచే పోస్టర్ ఆవిష్కరణ




**నెల్లూరు, జూన్ 13, ప్రభాతవార్త** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల జూన్ 17వ తేదీన కోవూరు నియోజకవర్గంలో నిర్వహించబోయే భారీ మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యుం, ఏపీఎస్ఎస్డీసీ జిల్లా అధికారి శ్రీధర్‌లు మెగా జాబ్ మేళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చే పోస్టర్ ఆవిష్కరణ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, వీటి ద్వారా దాదాపు 2100 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే వివరించారు. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, బీ.టెక్, బీ.ఫార్మసీ, పీజీ చదివిన అభ్యర్థులందరికీ వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. 18 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చుని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల విద్యార్హతలు, అనుభవాన్ని బట్టి నెలకు కనీసం రూ.12,000 నుంచి గరిష్ఠంగా రూ.25,000 వరకు జీతం ఉంటుందని, కొన్ని కంపెనీలలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారని తెలిపారు. నియామకమైన వారు కంపెనీల అవసరాలను బట్టి నెల్లూరు, నాయుడుపేట, ముత్తుకూరు సెజ్, శ్రీసిటీ సెజ్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కోవూరు నియోజకవర్గంలో స్థానిక యువతకు ఉద్యోగాలు అందించేందుకు నిరంతరం కృషి జరుగుతోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024 25)లో స్థానిక అవసరాల కోసం మండల స్థాయిలో 7 మినీ జాబ్ మేళాలు నిర్వహించగా, 698 మంది హాజరయ్యారని, అందులో 277 మంది ఎంపికయ్యారని తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025 - 26)లో ఇప్పటివరకు నియోజకవర్గం, జిల్లా స్థాయిలో 3 మెగా జాబ్ మేళాలు నిర్వహించామని, వీటికి 798 మంది అభ్యర్థులు హాజరుకాగా 378 మంది ప్రతిష్టాత్మక కంపెనీలకు ఎంపికయ్యారని ఎమ్మెల్యే వెల్లడించారు. యువత నైపుణ్యాలను ఉద్యోగాలుగా మార్చేందుకు ఈ జాబ్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని, జూన్ 17న జరిగే ఈ మెగా జాబ్ మేళాకు అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు.

## జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

### - యూరియాపై అపోహలు వద్దు



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త :** జిల్లాలో యూరియాకు సంబంధించిన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఈ విషయంలో రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో యూరియా కొరత ఉందనేది కేవలం అపోహ మాత్రమే అని, ప్రతిపక్షాలు పనిలేక రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కోవూరు నియోజకవర్గంలో మొత్తం 55 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని, ఇప్పటికే 42 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో 10 రోజుల్లో మిగతా 13 వేల ఎకరాల్లో కూడా నాట్లు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గానికి మొత్తం 7 వేల టన్నులు యూరియా అవసరం ఉండగా.. ఇప్పటివరకు 4.5 వేల టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వెయ్యి టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. అదనంగా కోవూరు మండలంలోని ఇనమడుగు గోదాములో మరో 2.5 టన్నులు సిద్ధంగా ఉందని, వెంటనే అది సొసైటీలకు, డీలర్లకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సీజన్‌లో నియోజకవర్గానికి సరిపడా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియా పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా ఉండాలని ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. ప్రయోగాత్మకంగా ఈ యాప్‌ను జిల్లాలో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎకరాకు మూడు బస్తాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామ న్నారు. కౌలు రైతులు కూడా ఎటువంటిసమస్య లేకుండా యూరియా పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. పంట సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్నదే ప్రభుత్వ సంకల్పం అన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు యూరియాపై రాద్ధాంతం చేస్తున్నారని, అన్నదాతలకు అవసరమైన యూరియాను అందిస్తామన్నారు. పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత, తదితరులు ఉన్నారు.

## చేనేత జన సమాఖ్య నేత, డాక్టర్ మాచర్ల మోహన్ రావుపై దాడి చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్



**నెల్లూరు, జూన్ 13, ప్రభాతవార్త - అగ్రికల్చర్ :** పొదలకూరులోని రమణారెడ్డి కాలనీ వద్ద ఉన్న కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ మోచర్ల మోహన్ రావు పై జరిగిన దాడిని కమిటీ నేతలు తీవ్రంగా ఖండించారు. దాడి ఘటనను వ్యతిరేకిస్తూ కరపత్రాన్ని విడుదల చేసి నిరసన వ్యక్తం చేశారు ఈ ఘటన వివరాల్లోకి వెళితే చీరాలలోని సిదూర్ (సుధీర్) కాలనీ చేనేత కార్మికుల భూములను కబ్జా చేస్తున్న ల్యాండ్ మాఫియాను చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకులు డాక్టర్ మాచర్ల మోహన్ రావు అడ్డుకున్నారు. 1992లో సిదూర్ సంస్థ నిరాశ్రయులైన 300 చేనేత కుటుంబాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇళ్ల నిర్మాణ ఒప్పందం చేసుకుంది. 1998 నాటికి 200 ఇళ్లు పూర్తయ్యాయి. అందులో చేనేత కార్మికుల శిక్షణ, సామాజిక అవసరాల కోసం కేటాయించిన 1.86 సెంట్ల భూమిని, భవనాన్ని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా కబ్జా చేశారు. ఈ అన్యాయాన్ని డాక్టర్ మాచర్ల మోహన్ రావు వెలుగులోకి తెచ్చారు. దీంతో మోహన్ రావు పై కక్ష పెంచుకున్న రియల్టర్లు ఆయనను హతమార్చాలని ప్రయత్నించారు. ఈ నెల 6న భూమి కొలతలు జరుగుతుండగా, అక్కడికి వచ్చిన మోహన్ రావుపై భూఆక్రమణదారులు ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా ప్రాణాంతక దాడికి పాల్పడ్డారు. దీనిపై ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు మాట్లాడుతూ చేనేత కార్మికుల పక్షాన పోరాడుతున్న మాచర్ల మోహన్ రావుపై దాడి చేసిన ఎమ్మెల్యే అనుచరులపై ఐపిసి 307 (హత్యాయత్నం) కింద కేసు నమోదు చేయాలని, మోహన్ రావు తదితరులపై బనాయించిన అక్రమ ఎస్సీ, ఎస్టీ కేసులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు కటికాల వెంకటేశ్వర్లు, పముజుల హరి, పముజుల శంకరయ్య, చేనేత సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, ఊకోటి లక్ష్మీనారాయణ, బత్తూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం విజయోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలించిన టిడిపి నాయకులు



**నెల్లూరు, జూన్ 13, ప్రభాతవార్త - వైద్యం** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పేరుతో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో నెల్లూరు నగరంలోని కెవిఆర్ పెట్రోల్ సమీపంలో గల కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఈనెల 16వ తేదీ కూటమి నేతలు బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, రాష్ట్ర అంతర్గత జల మార్గాల అథారిటీ చైర్మెన్ జెడ్ శివప్రసాద్, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డితో కలసి పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని, ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా వారు అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.వారి వెంట అధికారులు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఈఓ బాలాజీ రావ, తదితర అధికారులు ఉన్నారు.

## కిమ్స్ హాస్పిటల్‌లో అవయవదానం



అవయవదానంతో పలువురికి వెలుగులు నింపిన ఉలవపాటి : జీవ






**నెల్లూరు, జూన్ 13, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్‌లో బ్రెయిన్ డెడ్‌తో చికిత్స నిమిత్తం వచ్చిన ఉలవపాటి జీవ కుటుంబ సభ్యులు ఆమోదంతో అవయవదానం చేసి పలువురికి వెలుగులు నింపారని కిమ్స్ వైద్యులు, జీవనదాన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితాంతం సేవ చేసిన దాత ఉలవపాటి జీవ మరణానంతరం కూడా అవయవాలు దానం చేసి ఎందరో ప్రాణాలు కాపాడాడని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని బ్రహ్మానందపురం, దర్గామిట్టకు చెందిన వేంకటాద్రి కుమారుడు ఉలవపాటి జీవకి ఈ నెల 10వ తేది బైక్ మీద వెళ్తుండగా కేవిఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో ఉలవపాటి జీవను చికిత్స నిమిత్తం ఆయనను నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్ ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్‌కు చికిత్స నిమిత్తం తీసుకుని వచ్చారు. అతను హాస్పిటల్‌కి వచ్చే సమయానికి ఊపిరి పీల్చుకోలేక ప్రాణాపాయస్థితిలో స్పృహ కోల్పోయి కనుపాపలు కూడా కదలికలేని పరిస్థితిలో ఉన్నారని వైద్యులు తెలిపారు. అతనిని పరీక్షించిన సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్. కృష్ణమోహన్ అతనికి వెంటనే కృత్రిమ శ్వాసని అందించి ఆపరేషన్ చేసినా ఉపయోగం లేకపోవడంతో ఎన్ఐసియులో వెంటిలేటర్ మీద అడ్మిట్ చేశారు. 24 గంటల తర్వాత కూడా ఏమి ఇంప్రూవ్మెంట్ లేకపోవడంతో ఏపీఎన్ ఈఏ టెస్ట్ చేయగా బ్రెయిన్ డెడ్ అని నిర్ధారణ చేశారు. అనంతరం 6 గంటల తర్వాత కూడా మరొక అదే టెస్ట్ చేసి బ్రెయిన్ డెత్ అని నిర్ధారించారు. దీంతో తమ వైద్య బృందం అవయవ దానం ప్రాముఖ్యతను అతని కుటుంబ సభ్యులకు వివరించారు. అతని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు హృదయపూర్వకంగా అంగీకరించారు. దీంతో ఈ విషయాన్ని జీవనదాన్ సంస్థకు తెలియజేయగా, జీవనదాన్ ప్రోటోకాల్ ప్రకారం అవయవాల కేటాయింపుకు ప్రభుత్వ ఆదేశాలు జారీ చేశారు. అవయవాల కేటాయింపు వివరాలు ఇలా వున్నాయి. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి ఊపిరితిత్తులును చెన్నై అపోలో హాస్పిటల్, గుండెను తిరుపతిలోని శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్, లివర్‌ను కర్నూల్‌లోని కిమ్స్ హాస్పిటల్, వమరొక కిడ్నీని నెల్లూరు కిమ్స్ హాస్పిటల్, నెల్లూరు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు కళ్ళు అందజేశారు. మరణించిన తర్వాత కూడా పలువురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపి వారికి పునర్జన్మ ప్రసాదించిన ఉలవపాటి జీవ ఘన కీర్తిని కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం, అవయవ గ్రహీతలు కొనియాడారు. అనంతరం హాస్పిటల్ హెచ్ ఓడి,చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్. సి.ఎస్. శ్రీనివాస రాజు, నెల్లూరు జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. కే. మాధవి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్. ఏ. సన్నెస్ రెడ్డి, సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్. సి. హెచ్. సురేష్ కుమార్ రెడ్డి, హెచ్.ఓ.డి. ఇంటెన్సివిస్ట్, అనస్థెటిస్ట్ డాక్టర్. వి.జగదీష్, హెచ్ఓడి, చీఫ్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ శేషయ్య, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్. సి. కృష్ణమోహన్, యూనిట్ హెడ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. రోహిణి ప్రియ లక్ష్మి, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీధర్ రెడ్డిలు ఉలవపాటి జీవ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి కుటుంబం చేసిన ఈ మహోన్నత సేవ సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే వారి గొప్ప సేవను అభినందించారు. వైద్యులు, జీవనదాన్ బృందం మరణానంతరం కూడా పలువురికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన అవయవ దాత ఉలవపాటి జీవ నిజమైన మహానుభావుడని కొనియాడారు. వారి మానవత్వం, సేవాభావం సమాజానికి ఆదర్శప్రాయమని, వారి కుటుంబం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయం అనేక కుటుంబాల్లో ఆశాకిరణాలను వెలిగించిందని వైద్యులు పేర్కొన్నారు. అవయవ దానం మహాదానం అనే సందేశాన్ని వారి త్యాగం చిరస్థాయిగా చాటిచెబుతుందన్నారు. ఆ దాతకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక నివాళులు కృతజ్ఞతలు తెలియచేశారు.

## గందమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, జూన్ 13 ప్రభాతవార్త :** పట్టణంలోని ఒంగోలు బస్టాండు సమీపంలో హాజరత్ సయ్యద్ ఫక్రుద్దిన్ బాబా ఉరఫ్ పుట్టేషావలి పీర్ రహమతుల్లాహి అలైహి వారి దర్గాలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంధం మహో త్సవ కార్యక్రమాలకు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు ఘనంగా స్వాగతంపలికారు. అనంతరం ఎమ్మెల్యే దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్బంగా నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, నియో జకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి ఆద్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కోరుకున్నారు. గంధ మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎక్కడ ప్రయోజనం ఉంటే అక్కడ మాత్రమే ఓటరుగా ఉండండి



**ఉదయగిరి, జూన్ 13, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం నుంచి బతుకుదెరు వు కోసం వివిధ ప్రాంతాలకు వెళ్ళిన ప్రజలు ఏ రాష్ట్రంలో ప్రయోజనం ఉంటుందో అక్కడ మాత్రమే ఓటు హక్కును కలిగి ఉండాలని బీజేపీ జిల్లా ఆర్టీఐ కన్వీనర్ ముడుమాల రమేష్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉదయగిరి ప్రాంతానికి చెందిన అనేక మంది ఉపాధి, ఉద్యోగాలు, జీవనోపాధి కోసం తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి అక్కడ స్థిరపడుతున్నారని అటువంటి వారు తమ ఓటు హక్కును ఎక్కడ వినియోగించుకోవడం వల్ల తమకు, తమ కుటుంబానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందో ఆలోచించుకోవాల్సి న అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు,జీవన ప్రమానాలు భవిష్యత్ అవకాశాలు ఎక్కడ మెరుగ్గా లభిస్తున్నాయో పరిశీలించి, అదే ప్రాంతంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో రాజకీయ నాయకుల మాటలకు ప్రభావితమవకుండా తమ స్వంత ప్రయోజనాలతో పాటు కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోమని అభ్యర్థించారు. రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా బూత్ లెవల్ ఏజెంట్లులు, బూత్ లెవల్ అదికారులు మీ ఇంటికి రావడం లేదా ఫోన్ ద్వారా సంప్రదించడం జరుగుతుందని ప్రజలు సరైన సమాచారం అందించి ఓటరు జాబితాలను ఖచ్చితంగా రూపొందించడంలో సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే ఎన్నికల్లో పార్టీలు, కులాలు, వర్గాలు అనేక అంశాల కంటే మన గ్రామానికి, మన ప్రాంతానికి నిజంగా సేవ చేసే నాయకుడు ఎవరు..? ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థి ఎవరు అనే విషయాలను పరిశీలించి ఓటు వేయాలని ఆయన విజప్తిచేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుఅమూల్యమైందని, దానిని భాధ్యతాయుతంగా వినియోగించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమని అన్నారు. తెలుగురాష్ట్రాల నుంచి తమిళనాడు కర్ణాటక ప్రాంతాలలో అక్కడ ఓటు వేస్తూ ఇక్కడ ఓటు వేస్తూ ఓటుకు అర్థం లేకుండా చేస్తున్నారని ఎక్కడ మీకు అనుకూలమైన వాతావరణం ఉంటుందో అక్కడ మీ ఓటును శాశ్వతంగా ఉంచుకొని రెండో ఓటును మీకై మీరు స్వచ్ఛందంగా విరమించుకుంటే బాగుంటుందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు అంటే వలస జీవులు ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలని కోరారు.

## కోనలో నృసింహుని దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు

**...వైభవంగా నృసింహుని కళ్యాణోత్సవం..శ్రీవారికి రూ. 11,79,036 రాబడి**



**రాపూరు, జూన్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది.పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరు కొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఇందు లో భాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం,గోపూజ, పులాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వైభవ ంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు,క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమిషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. శ్రీవారికి రూ.11,79,036 రాబడి శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.11,79,036 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళం రూపేణా రూ.4,23,460లు, శ్రీవారి ఆర్జిత టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 29,250లు, నిత్య కళ్యాణం ద్వారా రూ. 50,061లు, 100 రూపాయిల ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,22,200లు,దేవస్థానం వసతి ద్వారా రూ.27,500లు, తలనీలాలు 2,799 మంది సమర్పించగా తద్వారా రూ. 1,11,900 లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 2,77,250లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.36,350లు,వాహనాల పూజల ద్వారా రూ.1,065లు పోవ్వున మొత్తం రూ.13,62,798 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డితెలిపారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2466 మంది స్వీకరించారని, రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు మొత్తం 9,950 మంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శేషి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

## ఓటర్ జాబితా సవరణపై అవగాహన



**కలువాయి జూన్ 13 ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు శనివారం తహసిల్దారు కృష్ణారెడ్డి అధ్యక్షతన మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తహసిల్దారు మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణపై మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి బిఎల్ఓలు వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని దృవీకరిస్తారని ఆయన తెలిపారు. అదే విధంగా ఈకార్యక్రమంలో బిఎల్ఓలతోపాటు రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏలు కూడా పాల్గొని తమ అభ్యంతరాలు సూచనలు తెలియజేయాలని అన్నారు.ఫారం 6,7,8 వినియోగం పై అవగాహన కల్పించారు. 2002 తరువాత ఎన్నికల కమిషన్ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.గ్రామం నుండి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి పోయిన వారు అదే విధంగా మరణించిన వారి వివరాలను తెలియజేసి బిఎల్ఓలు ,బిఎల్ఏలకు సహకరించాలని ఈ సందర్భంగా తహసిల్దారు కోరారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ సునీల్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## శ్మశాన భూమిని అభివృద్ధి చేస్తాం తప్ప అక్రమించలేదు



**మనుబోలు జూన్ 13 ప్రభాతవార్త :** మేము మంచి పనిచేస్తున్నాం చెడ్డపని చేస్తే మమ్మల్ని ఆ శ్రీరాముడే శిక్షిస్తాడని నీటి సంఘం అద్యక్షులు అక్కంపేట సీనియర్ టిడిపి నాయకులు ఏలూరు కోదం డరామిరెడ్డి అన్నారు. శనివారం మనుబోలు మండలం అక్కం పేట గ్రామంలో స్మశాన భూమిని టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. మీడియాకు ఆభూమిని చూపించి మాట్లాడారు. సెంటు ప్రభుత్వ భూమిని ఎప్పుడు మేము అక్రమించింది లేదన్నారు. మాకు ఆలోచన కూడా లేదన్నారు. కేవలం శ్మశానమును అభివృద్ది చేయాలని చేస్తున్నాం తప్ప మాకు వేరే ఉద్దేశం లేదని అన్నారు. రెండు ఎకరాల 50 సెంట్లు ప్రభుత్వ భూమిని స్మశానానికి కేటాయించారన్నారు. ఇందులో కొంత స్మశానం పోను మిగతా భూములలో శ్రీరాముని దేవస్దానానికి కేటాయించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి కూడా తీసుకొని పోయామన్నారు. ఆయన సలహా మేరకు అభి వృద్ధి చేస్తున్నామన్నారు. ఆయన సలహా మేరకే అభివృద్ది చేస్తు న్నామన్నారు. మంచి పనులు చేయడం తప్పుకాదన్నారు.టిడిపి తిరుపతి పార్లమెంట్ అధి కార ప్రతినిధి అమీర్ బాషా,టిడిపినాయకులు ఆంజనేయులు పెంచలరెడ్డి,దొడ్డి రవీంద్రరెడ్డిరాజశేఖర్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రసన్న పరామర్శలు



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త :** మాజీ ఎంపీపీ , మాజీ జెడ్పీటీసీ సభ్యులు కైలా సం ఆదిశేషారెడ్డి మాతృమూర్తి కైలా సం రాజేశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు శనివారం నెల్లూరులో నివాసం ఉంటున్న మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యు డు ప్రసన్న కుమార్‌రెడ్డి కైలాసం కుటుంబ సభ్యులను పరామర్శించిన తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సమయంలోనే గుండె దిటవు చేసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## త్రిబుల్ ఐటిఐలో జడ్‌పి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



**కలువాయి జూన్ 13 ప్రభాతవార్త :** త్రిబుల్ ఐటి ఎంపిక నందు శనివారం విడుదలైన ఫలితాలలో కలువాయి మండలానికి చెందిన జడ్‌పిహైస్కూల్‌లో విద్యార్థులు సత్తా చాటారు. బివిఎన్ఆర్ జడ్‌ప హైస్కూల్ కలువాయి పాఠశాల నందు జి.జాహ్నవి, వి నందకిషోర్, సిహెచ్ సుప్రియా, అదే విధంగాచీపినాపి పాఠశాల నందు అర్చన,దాచూరు పాఠశాల నందు ఎస్‌కె ఫరీదా, కె కార్తీక్‌ఎంపికైయ్యారని పాఠ శాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌డి అబ్బాస్ అలీ ఎస్.జనార్దన్‌రెడ్డి, అంకయ్యలు తెలిపారు. అదే విధంగా మండల విద్యాశాఖ అధికారులు పి.నవీన్,ఎస్ జనార్దన్‌రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా ర్థులను అభినం దించారు.

## కోనలో నృసింహుని అన్నదానానికి రూ.2,00,232 విరాళం



**రాపూరు, జూన్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్య అన్నదానానికి శనివారం స్వామి వారి భక్తులు, రూ. 2,00,232 విరాళాన్ని అంద జేశారు. కడప జిల్లా వాస్తవ్యులు కల్లూరు శివ నరసిం హులు, ధర్మపత్ని చందరకళ, కల్లూరు జయనరసింహుల, ధర్మపత్ని రాధా గార్లు రూ. 2,00,232 విరాళాన్ని అలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డికి అందజేశారు. స్వామి వారి అన్న ప్రసాదానికి విరాళం అందించిన దాతలకు స్వామి వారి ప్రత్యేక దర్శనం, స్వామి వారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను ఆందజేశారు.

## ఘనంగా జిష్ణు ఆర్యన్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు, జూన్ 13, ప్రభాతవార్త – వైద్యం :** మంత్రి పొంగూరు నారా యణ, గంటా శ్రీనివాసరావు మనవడు జిష్ణు ఆర్యన్ 9వ జన్మదిన వేడుకలు నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పి టల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్‌లోని చిన్నపిల్లల విభాగంలోని చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి, వీడియో కాల్ ద్వారా జిష్ణుఆర్యన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నారాయణ మెడికల్ కాలేజ్ డీన్ డా. పి. శ్రీనివాసుల రెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డా. హరీష్ రావులపల్లి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన జిష్ణుఆర్యన్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశీర్వాదించారు. అనంతరం నారాయణ విద్యా సంస్థలు, వైద్య విద్యా సంస్థల సిబ్బంది ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నందు పేదలకు, బుజబుజ నెల్లూరులోని సింహపురి చిన్నపిల్ల ఆశ్రమం నందు బాల బాలికలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ పిల్లలకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ పిడియాట్రిక్ విభాగాధిపతి డా. చంద్రశేఖర్, డిప్యూటి మెడికల్ సూపరింటెండెంట్ డా. అరుణ్ కాంత్, ఏజిఎం ఎసి శేఖర్ రెడ్డి, నర్సింగ్ సిబ్బంది, ఎన్ – స్పైరా సిబ్బంది సుధాకర్, కొండారెడ్డి, దిలీప్, రాజా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాపూరులో వేడుకగా జగన్నధ రధోత్సవం



**రాపూరు, జూన్ 13, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో శనివారం నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాధ రధయాత్ర వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా స్థానిక కోయ్యల మిల్లు సెంటర్ నుండి వేలది సంఖ్యలో భక్తులు పాల్గోని స్వామి వారి రధాన్ని హారే రామా.హరే రామా రామ రామా హరే హారే అంటూ నినాదాలు చేస్తూ స్వామి వారి రధాన్ని లాగుతూ భక్తి పారవశ్యంతో ముందుకు సాగారు. ఆర్ అండ్ బి బంగ్లా వరకు వెల్లి తిరిగి సిద్దలయ్య గుడి సెంటర్ వరకు వెల్లిన రధయాత్ర ముగింపుగా మద్దెలమడుగు సెంటర్‌లోని శ్రీ రాధాకృష్ణ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయం వద్ద ముగిసింది. రధయాత్ర సంధర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పలు కూడళ్ళలో మజ్జిగ,పలు రకాల ప ండ్ల రసాలను భక్తులకు ఆందజేశారు. జగన్నాధ రధయాత్ర సందర్బంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాపూరు సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాపూరు ఎస్ఐ కె. తిరుమల రావు, సైదాపురం ఎస్ఐ దుర్గా ప్రసాద్, కండలేరు ఎస్ఐ ఆదిలక్ష్మిలు బద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## ఓటు భద్రం.. మ్యాపింగ్ ముఖ్యం ..!

**కోట,13 ప్రభాతవార్త :** కచ్చితమైన పారదర్శకమైన తప్పులు, లేని ఓటరు జాబితా రూపకల్పనకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఇందులో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత కీలకం. సర్‌లో ప్రధానంగా మూడు రకాల మ్యాపింగ్‌లున్నాయి. వీటి గురించి ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలగి ఉండాలి. మీ ఓటు భద్రంగా ఉండాలంటే అందరూ మ్యాపింగ్ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 15 నుంచి జులై 14 వరకు ఈ ప్రక్రియ జరుగుతంది. ఆలోగా మ్యాపింగ్ చేసుకుంటే ఓటరుగా ఉంటారు. లేదంటే సమస్య తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. చాల ముఖ్యం బీఎల్‌లో వద్దకు వెళ్లిన తర్వాత సెల్ఫ్ మ్యాపింగ్,యూడ్ ప్రోజెన్సీ సెల్ఫ్ ప్రోజెన్సీ అనే పదాలను మీరే స్పష్టంగా చెప్పి మ్యాపింగ్ చేయించుకోవాలి. ఎందుకంటే బీఎల్‌వోలు వివిధ రకాల పని భారంతో ఒత్తిళ్లతో నలిగిపోయి ఉంటున్నారు. ఓటు హాక్కును కోల్పోకుండా చూసుకోవాలి. అందరూ తప్పనిసరిగా మ్యాపింగ్ చేయించుకోవాలి.

## అపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే



**కావలి, జూన్ 13 ప్రభాతవార్త :** పట్టణంలోని ముసునూరు 15వ వార్డులో శనివారం నిర్వహించిన క్లీన్‌స్వీప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొనడం జరిగింది. వార్డులోని ప్రధాన వీధులు, కాలువలు, చెత్త నిల్వ ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్య రక్షణకు పారిశుద్ధ్యమే ప్రధానమని పేర్కొంటూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటి ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వ్యవస్థను వినియోగించాలని సూచించారు. ఈసందర్బంగా మున్సిపల్ అధికారులకు పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. ప్రజాభాగస్వామ్యంతో కావలి మరింత పరిశుభ్రమైన, ఆదర్శపట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ సాయిరాం, కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కండలేరులో 36 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 13, ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో శనివారం ఉదయానికి 36 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.జళాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు హై లెవల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 1280 క్యూసెక్కులు,హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 715 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు బ్రహ్మదేవం విద్యుత్ స్టేషన్‌లో మరమ్మత్తులు

**తోటపల్లి గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త :** బ్రహ్మదేవం 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం (జూన్ 14) ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తోటపల్లి గూడూరు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు పేదూరు, పాపిరెడ్డిపాలెం, ఇసుకపాలెం, తోటపల్లి, తోటపల్లి గూడూరు, మాచర్లవారిపాలెం, సాదిపేట, ఈదూరు, వరకవిపూడి, అనంతపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## 21న హనుమాన్ శోభాయాత్ర



**ఆత్మకూరు ,జూన్12,ప్రభాతవార్త:** ఈనెల 21వ తేదీ ఆదివారం సాయం త్రం 4గంటలకు ఆత్మకూరు పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరుగుతుందని ఈ మహో త్సవాన్ని విజయవంతం చేసేందుకు రామభక్తులు, , హనుమాన్ భక్తులు ఉమ్మడిగా సమాయాత్తమై విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని శోభాయాత్ర కమిటీ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం దేపూరు, మహిమలూరు, డిసిపల్లి గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించి గ్రామ ప్రజలను శోభాయాత్రకు ఆహ్వానించామని, ఆయా గ్రామాల పెద్దలు, పూజారులు, ప్రముఖులను కలిసి ఈ దైవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరామన్నారు.కావునప్రజలందరూ ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## కొండ బిట్రగుంట లో యోగాసనాలు




**బిట్రగుంట జూన్ 13 ప్రభాతవార్త :** బోగోలు మండలం, కొండ బిట్రగుంట గ్రామం నందు, వెలసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు శనివారం ఉదయం యోగలో భాగంగా సూర్య నమస్కారం, ప్రాణాయమ్, ధ్యానం కార్యక్రమాలను నిర్వహించారు యోగ మాస్టరగా కార్యనిర్వాహణాధికారి అరవ రాధాకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, సభ్యులు సిబ్బంది, భక్తులు పాల్గొని యోగ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రకృతి వైపరీత్యాల రక్షణకు మొక్కల పెంపకం చాలా అవసరం



**బిట్రగుంట జూన్ 13 ప్రభాతవార్త :** పకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలను నివారి ంచడానికి మొక్కలు పెంపకం చాలా దోహద పడతాయని స్మార్ట్ పూర్ ప్రాజెక్ట్ నెల్లూరు సూపర్వైజర్ ఎమ్.వి రమణయ్య తెలిపారు. బోగోలు మండలంలోని మంగమూరు, జువ్వలదిన్నె, సిఆర్ పాలెం గ్రామాలలో శనివారం రిచ్ సంస్థ వ్యవస్థాపకులు జేసీ పంత్ ప్రధమ వర్ధంతి సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం ను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లా డుతూ ప్రకృతి వైపరీత్యాల వలన ఆస్తి,మానవ పశు సంపద నష్టపోతుందని తెలిపారు గాలుల తీవ్రత వలన ఇల్లు కూడా పడిపోయి ఉండటానికి నిలువు నీడ లేకుండా నిరాశ్రయులు అవుతారు మనము చెట్లు నాటి సంరక్షించగలిగితే పకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలను నివారించడానికి మొక్కలు పెంపకం చాలా దోహద పడతాయన్నారు . మొక్కలుఆక్సిజన్ ని ఇవ్వటమే కాకుండా గాలుల తీవ్రతను తగ్గించి నష్టాన్ని నివారించడానికి ఉపయోగపడతాయని తెలిపిరి. మొక్కలపై నేరుగా పడే సూర్యరశ్మిని నియంత్రించి, అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడమే కాకుండా పక్షులు, కీటకాలు మరియు ఇతర హానికర జీవుల నుంచి మొక్కలను కాపాడుతుంద న్నారు.నేలలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండేలా సహాయపడుతుంది, తద్వారా నీటి వినియోగం తగ్గి అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా మొక్కల ఎదుగుదల వేగవంతమై దిగుబడి పెరుగుతుంది.బలమైన గాలులు మరియు భారీ వర్షాల వల్ల మొక్కలకు కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా ద నెల్లూరు జిల్లా జిల్లాలోని మూడు మండలాలలో 10 గ్రామపంచాయతీలలోని సచివాలయము,పాఠశాల అంగన్వాడి స్కూలు మొదలగు పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మొదలు పెట్టామని వీటి యొక్క సంరక్షణకు రక్షణకి ట్రీ గార్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి యొక్క సంరక్షణలో ప్రజలు భాగస్వాములై వాటిని కాపాడి గ్రామంలో పర్యావరణ సమతుల్యాన్ని రక్షించుటలో సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీస్ శైలజ, టీ డి పి నాయకులు నాగరాజు, శారదా (వి ఒ ఏ) వినోద్, కొండయ్య, ప్రసన్న, కమ్యూనిటీ మొబైల్జె రు రాజా ,కంప్యూటర్ అకాడమిక్ ఇన్స్పెక్టర్ తంబీ నవీన్, బాబూ, చెంచయ్య సెంటర్ ఫెసిలిటేటర్లు, సెంటర్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యపై స్పందించి తక్షణ చర్యలు చేపట్టిన ఈవో




**ఉదయగిరి, జూన్ 13, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన వర్షపు నీరు కాలువలో పేరుకుపోయి ప్లాస్టిక్ కవర్లు వ్యర్థాలతో నిండి ఇంట్లోకి వచ్చిన వర్షపు నీరుపై వెంటనే ఈవో వెంకటేశ్వర్లు స్పందించి సిబ్బందితో సమ స్యను వెంటనే పరిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకటన ప్రజలు ఇలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా ఉండేం దుకు ఇంటి పరిసరాల పరిశుభ్ర తను ఎలాగ పాటిస్తారు, అలాగే ఇంటికి చుట్టు పక్కల సైడు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లను ఇంట్లోనే వ్యర్థాలను వేయకుండా శుభ్రంగా చూసుకున్నప్పుడే ఇలాం టి పరిస్థితులు ఎదురవకుండా ఉంటాయని అందుకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థా లు వాడకూడదు వాటి వినియోగం వల్ల తలెత్తే పరిణామాలను వివరిస్తూ చెత్త సేకరణ తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ కార్మిక సిబ్బందికి వీధుల్లోకి వచ్చినప్పుడు అందించి సహకరించాలని ఎన్నో అవగా హన కార్యక్రమాలు పెట్టిన ఫలితం లేకుండాపోవడంతో నేడు చిన్నపాటి వర్షానికి కాలువల్లో పేరుకుపో యిన ప్లాస్టిక్ కవర్లు వర్షపు నీటికి అడ్డుపడి రోడ్లపైకి ఇండ్లలోకి ప్రవేశించాయని ఇలాంటి పరిణామాలు జరగకుండా ఉండాలంటే ప్రజలు ప్లాస్టిక్ కవర్లను కాలువల్లో వేయకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా కాలు వలపై దుకాణ యజమానులు శుభ్రం చేయకుండా బండలను ఏర్పాటు చేసి కొన్ని దిక్కల కాలువల పైన పర్మినెంట్ గా దుకాణంలో పోయేందుకు మార్గాన్ని గట్టిగా బందోబస్తు చేయడంతో సిబ్బంది కాలువలను శుభ్రం చేయడంలో ఇబ్బందులకు గురవుతూ వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారని సిబ్బందికి కాలువలను శుభ్రం చేసేందుకు దుకాణ యజమానులు కూడా సహకరించాలని అప్పుడే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోగలమని ఆయన పట్టణ ప్రజలను కోరారు.

## కార్మికుల సమస్యలపై కరపత్రాలు పంపిణీ



**ఉదయగిరి, జూన్ 13, ప్రభాతవార్త :** భవన నిర్మాణం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేపట్టే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని స్థానిక సీఐటీయు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనివారం బస్టాండ్ సెంటర్ దుకాణ యజమానులకు భవన నిర్మాణ మేస్త్రీలకు కూలీలకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా మండల నాయకుల ఆదేశాల మేరకు భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక లేబర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. 60ఏళ్లు నిండిన కార్మికులకు రూ.6వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ అల్లి, కేపీ కొండయ్య, సామ్యేల్, బీమయ్య, వెంకట రమణ, మేస్త్రీ జాన్ తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రికలు ఆవిష్కరణ



**గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సివిసి పార్క్ నందు జెవివిలో సభ్యులుగా చేరండి అని గోడ పత్రికలను జెవివి ప్రతినిధులు ఆవిష్కరించారు. జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాల నుండి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం, మూఢ నమ్మకాల నిర్మూలన కోసం పనిచేస్తుందని ప్లాస్టిక్‌ను నిషేధించాలని, విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి చెకుముఖి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యార్థులు జెవివిలో భాగస్వాములు కావాలని మంచి సమాజం కోసం అందరం కష్టపడదామని కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచు నారాయణ, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్, శ్రీనివాసా చారి, సురేష్, పసల వెంకటేశ్వర్లు, మనోభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృత దేహం లభ్యం



**చిల్లకూరు, జూన్ 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఏరు చెరువులో ఏరూరు విఆర్ఓచే రాబడిన సమాచారం మేరకు ఏరూరు పెద్ద చెరువులో సుమారు 40,45 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని మగ శవంను గుర్తించారు. ఆచూకీ తెలిసిన యెడల చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐకి సమాచారం అందించారు. మరిన్ని వివరాలకు 9440796347 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## స్కాన్ చేయండి.. ఉద్యోగుల పనితీరు చెప్పండి

**కోట, జూన్ 13 ప్రభాతవార్త :** స్వర్ణ గ్రామ (సచివాలయాల) కార్యాలయాల్లో ఉద్యోగులు పనితీరు పై ప్రజల అభిప్రాయాయ సేకరణ కోసం ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని అమరావతిలోని కేంద్ర కార్యాలయాలనికి అనుసంధానం చేసింది. ఈ కోడ్‌ను ఆయా కార్యాలయాల్లో అందరికీ కనిపించేలా నోటీసు బోర్డులో ఉంచారు. కార్యాలయంలో ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్య ంగా ఉన్నట్లు గుర్తించినా, తమ పనిని చేయడానికి జాప్యం చేసినా,సక్రమంగా స్పందించకపోయానా ప్రజ లు అక్కడికక్కడే అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను చరవాణీ సాయంతో స్కాన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు

**ఫిర్యాదు చేసేది ఇలా :** స్కాన్ చేస్తే చరవాణీలో మూడు ప్రశ్నలు ప్రత్యక్షమవుతాయి. కార్యాలయం సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది? ఉద్యోగులు అందుబాటులో ఉన్నారా ? లేరా ? కార్యాలయానికి మీరు వచ్చిన పని సంతృప్తికరంగా జరిగిందా ? అనే ప్రశ్నలకు తమ అభిప్రాయాన్ని పొందుపర్చాల్సి ఉంది. ఆ తర్వాత ఫిర్యాదు చేసిన వారి పేరు, చరవాణీ నంబరు నమోదు చేయాలి. అనంతరం ఆ అభిప్రాయం సంబంధిత ఉన్నతాధికారుల పరిశీలనకు వెళ్తుతుంది.

**జవాబుదారీతనం, పారదర్శకత :** ప్రజలకు సత్వరం సేవలు అందించడం అది కూడా మెరగైన సేవలు పారదర్శకంగా అందించడమే క్యూఆర్ కోడ్ ఉద్దేశమని కోట మండల ఎంపిడివో ఆర్.దీలిప్ కుమార్ అన్నారు సేవల్లో జాప్యం నివారించడం,ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరిచాడానికి వీలువుతుంది. కార్యాలయాల్లో ఉన్న కోడ్ ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

## ఒంగోల్ ట్రిపుల్ ఐటి కి ఎంపికైన సురేఖకు అభినందనలు



**కోట, జూన్ 13 ప్రభాతవార్త :** కోట మండలం ఊనుగంటపాళెం చెందిన సురేఖ కోట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతిలో 573 మార్కులు సాధించి మండలంలోని దిత్వీయ స్ధానంలో నిలచింది. ఆమేరకు ఆవిద్యార్ధికి ఒంగోల్ గాజీవ్ గాంధీ యూనివర్శిటిలో ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ప్రవేశంలో సీటు లభిచింది. దీంతో ఇంటర్‌తో పాటు ఇంజినీరింగ్ కోర్సు ను కూడా ఆరేళ్ల ఉచితంగా కేంద్ర ప్రభుత్వ ఖుర్చులతో ఆవిద్యార్ధిని విద్యను అభ్యసిస్తారు. ఆమేరకు కోట మండల ఎంఇఒ1 జి.శిరిష్ .ఎంఇఒ2 మస్తానయ్య ప్రధానోధ్యాయులు పి.భారతి కూడా సురేఖను అభినిందించారు.

## కోత్తపాళెం విద్యార్ధిని నాగ శీరిష్‌కు ట్రిపుల్ ఐటిలో సీటు



**కోట, జూన్ 13 ప్రభాతవార్త :** కోట మండలం నెల్లూరు పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదోవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన నాగ శిరిషకు 573 మార్కులు వచ్చాయి. కడప జిల్లాలోని ఇడుపులపాయిలోని రాజీవ్‌గాంధీ విశ్వవి ధ్యాలయాంలో సీటు లభిచింది. ఆమేరకు నాగశీరిష్‌ను ఎంఇఒ1 శిరిష, ఎంఇఒ2 డి.మస్తానయ్యలు అభినందించారు. ఈ వి ద్యార్ధిని ఇంజినిరింగ్ కోర్సు 573 పూర్తి యింత వరకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా చదివిస్తోంది. నాగ శిరిషను పాఠశాల హెచ్‌ఎం గిరిధర్ అభినం దించారు .తమ బిడ్డకు ట్రిపుల్‌ఐటిలో సీటు రావడంతో శిరిష తల్లిదండ్రల్లో ఆనందం పెల్లుబికింది.

## ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఆర్థిక సాయం అందించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, జూన్ 13, ప్రభాతవార్త – వైద్యం** పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ప్రతిభావంతులైన విద్యార్థినులకు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అండగా నిలిచారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం విపిఆర్ విద్య పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు విపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థిక సాయం (చెక్కులను) అందజేశారు. విపిఆర్ విద్య పాఠశాలలో పదో తరగతిలో 594 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన చింతాడ మానస అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుకునేందుకు కళాశాల ఫీజుల నిమిత్తం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెక్కును అందజేసి అభినందించారు. అదే విధంగా, గత సంవత్సరం ఇదే పాఠశాలలో ప్రతిభ కనబరిచిన పొట్టికోటి గాయత్రి అనే మరో విద్యార్థిని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువును కొనసాగించేందుకు గాను ఆమెకు కూడా ఏడాది కళాశాల ఫీజుల నిమిత్తం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## త్రిబుల్ ఐటీలో గుండె మడకల స్కూల్ విద్యార్ధులు సత్తా

– ఐదుగురు విద్యార్థులకు సీట్లు




**వింజమూరు, జూన్ 13, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని గుండెమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ఐదుగురు విద్యార్థులు ప్రవేశం పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. కనకరావు తెలిపారు. గౌతమ్ సిద్ధార్థ త్రిబుల్ ఐటీ నూజివీడు జాహ్నవి త్రిబుల్ ఐటీ నూజివీడు శ్రీకాంత్ త్రిబుల్ ఐటీ ఒంగోలు రిజ్విక్ చరణ్ త్రిబుల్ ఐటీ శ్రీకాకుళం బి. సింధుజ త్రిబుల్ ఐటీ శ్రీకాకుళం, గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుంచి ఒకే ఏడాది ఐదుగురు విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీట్లు సాధించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యార్థులంతా పదో తరగతిలో 9.8 పైనే జిపిఏ సాధించిన వారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయులు ఆర్. కనకరావు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పట్టుదల క్రమశిక్షణతో చదివితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఈ విద్యార్థులు నిరూపించారు. భవిష్యత్తులో వీరంతా మరెంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి అని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని స్థానికులు కొనియాడారు. ఐఐఐటిలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఉచిత నాణ్యమైన సాంకేతిక విద్య అందుతుందని, ఇది వారి జీవితాలను మార్చేస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామంలో విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి - ముగ్గురు అరెస్ట్



**అనుమసముద్రంపేట, జూన్12, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట గ్రామ శివారు ప్రాంతంలోని పంట చేల వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఎస్ఐ షేక్ జిలానీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి పేకాట నిర్వహణకు ఉపయోగించిన సామాగ్రి, 2640రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జిలానీ మాట్లాడుతూ ఏఎస్‌పేట మండల పరిధిలో పేకాట, జూదం, అసాంఘిక కార్యకలాపాలు , ఇతర చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అందిన ప్రతి సమాచారం పై వెంటనే స్పందించి రైడ్ నిర్వహజంచి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకు ంటామ న్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేశారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ రామచంద్ర పాల్గొన్నారు.

## పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో పొలాల్లో గుర్తు తెలియని పురుష మృతదేహం పూర్తిగా ఉబ్బిపోయి ఉంది. ఈ మేరకు స్థానికులు కోవూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి కోవూరు ఎస్సై ముత్యాలరావు, పోలీసులు చేరుకున్నారు. ఈ వ్యక్తి నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని, ఒంటిపై చొక్కా గానీ లేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నియోజకవర్గం వైసీపీ ఎస్ఐఆర్ పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త :** మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు కోవూరు నియో జకవర్గం వైసీపీ ఎస్ఐఆర్ పర్యవేక్షణ కమిటీని నియమించారు. ఇందులో వీరి చలపతిరావు , పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కొండూరు అనిల్‌బాబు, గొల్లపల్లి విజయ్‌కుమార్, బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొట్టే మల్లికార్జున, కోడూరు మధుసూదన్‌రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, అనపల్ల ఉదయ భాస్కర్, మల్లు జయరామిరెడ్డిలు ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో బీఎల్ఏలను స్థానిక సీనియర్ నాయకులు ప్రతి రోజూ పర్యవేక్షిస్తూ మండల కన్వీనర్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రతిరోజూ నివేదికను నియోజకవర్గ ఇన్‌చార్జికి అందజేయాలని ఈ మేరకు మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఏడు మందికి త్రిబుల్ ఐటీ కళాశాలలో ప్రవేశం



**వింజమూరు, జూన్ 13, ప్రభాతవార్త :** వింజమూరులోని బాలికోన్నత పాఠశాల నుండి ఏడు మంది విద్యార్థినులు త్రిబుల్ ఐటీ కళాశాలలో ప్రవేశం సంపాది ంచినట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు నాగలక్ష్మి తెలియ జేశారు. ప్రవేశం పొందిన విద్యా ర్థులు నూజివీడు పాఠశాలలో రెడ్డి అక్షయ, పాతల శ్రీజ, షేక్ ముల్లా, రహీల, పి హారిక, ఎన్ యశ్వితలు కాగా ఇడుపులపాయ త్రిబుల్ ఐటీ కళాశాలకు టీ. కార్తీక అలాగే ఒంగోలు త్రిబుల్ ఐటీ కళాశాలకు ఎస్ శ్రీ రిషిత ప్రవేశం పొందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థినిలు ఎంతో ప్రతిభ చూపి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించారని ఆ మార్కుల ఆధారంగా ఈ సీట్లు సాధించడం సాధ్యమైందని తెలిపారు. మా పాఠశాలలో మొదటి నుండి పోటీ పరీక్షల సంబంధిత అంశాలపై విద్యార్థులకు బోధించడం జరుగుతుందని అందుచేతనే అన్ని పోటీ పరీక్షలలో మా విద్యార్థులు మొదటి స్థానంలో నిలుస్తారని ఆయన తెలిపారు. మా పాఠశాల ఉపాధ్యాయుల నిరంతర కృషి విద్యార్థులు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా ఈ ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వారికి ప్రోత్సాహాన్ని అందించిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నాగార్జున విద్యార్థి



**పొదలకూరు, జూన్ 13, ప్రభాతవార్త :** నేడు విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితాలో పొదలకూరు పట్టణంలోని శ్రీనివాసపురం వీధిలో ఉన్న నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి మేకల పూర్ణ చందు ప్రతిభ చాటాడు. ఎస్ఎస్‌సీ 2026 పరీక్షల్లో 589 మార్కులు సాధించిన మేకల పూర్ణ చందు, నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో ప్రవేశం పొందడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమారుడు కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించాడని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి సాధించిన విజయంపై పాఠశాల యాజ మాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పూర్ణ చందు విజయం పాఠశాలకు, పొదల కూరు పట్టణానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వ హించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులప ండువగా నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు రాఘవాచార్యులు, శ్రీనివాసులు స్వామి, ఆలయ పున:నిర్మాణ ధర్మకర్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, మాజీ చైర్మన్ పోలుదాసు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

## పేరు కొత్తది.. కష్టాలు పాతవే!

## టీడీపీ మండల యువత అధ్యక్షుడు బద్దిపూడి సూర్య ఆవేదన

**కొడవలూరు, జూన్ 13 ప్రభాతవార్త:** కొత్తగా ఏర్పడిన పెమ్మారెడ్డిపాలెం పంచాయితీలో ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ మండల యువత అధ్యక్షుడు బద్దిపూడి సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సొంత సచివాలయం, పంచాయితీ కార్యాలయం, అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రి, రైతు భరోసా కేంద్రం వంటి సదుపాయాలు లేక ప్రతి చిన్న పనికీ మిక్కిలింపేట సచివాలయానికి వెళ్లాల్సి న పరిస్థితి నెలకొందన్నారు. అక్కడి సిబ్బంది కూడా గ్రామ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. తన సొంత పొలాలకు అవసరమైన యూరియా కట్టలు కూడా విప్పించుకోలేని దుస్థితి ఉందని, అదే సమయంలో గ్రామ రైతులందరూ యూరియా కోసం తనను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. అధికారులు, పాలకుల నుంచి స్పందన లేకపోవ డంతో రైతుల సమస్యలు ఎలా పరిష్కరించాలో అర్థం కావడం లేదని బద్దిపూడి సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెమ్మారెడ్డిపాలెం గ్రామానికి అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు యూరియా సరఫరా సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చేజర్ల మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

– ట్రిపుల్ ఐటీల్లో 13 మందికి సీట్లు



**చేజర్ల, జూన్ 13, ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ప్రతిభ కనపరిచారు. శనివారం విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితాలో మండలానికి చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాల నుంచి మొత్తం 13 మంది విద్యార్థులు సీట్లు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. తూర్పుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందారు. జి.వైష్ణవి, వి.మెగా శ్యామ్‌లు నూజివీడు ట్రిపుల్ ఐటీలో, డి.ప్రతాప్ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో, జి.పెంచల సుశాంత్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. మాముదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సీహెచ్ వెంకట మహిధర్ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో, బాలిరెడ్డి శృతి, కే.మనస్మిత, ఆముదం యోషితలు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు. నాగులవెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కే.యస్మిత నూజివీడు ట్రిపుల్ ఐటీలో, పి.యశ్వంత్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందారు. అలాగే చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆర్.అభిరాం రెడ్డి నూజివీడు ట్రిపుల్ ఐటీలో, ఎస్‌కే సుహానా ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఆదురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కే.అనూష ఒంగోలులో సీటు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించడం పట్ల మండల వ్యాప్తంగా ఆనందం వ్యక్తమవుతోంది. ఇంత మంది ట్రిబుల్ ఐటీలో విద్యార్థుల విజయానికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందించిన ప్రత్యేక శిక్షణ, నిరంతర మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం కారణమని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు 1 ఇందిర, 2 మస్తానయ్య విద్యార్థులను, ప్రధానోపాధ్యా యులను, ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువ ుతూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఈ విజయం మండలంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని విద్యావేత్తలు తెలిపారు.

## గ్రంధాలయాన్ని మూసి వేయడం లేదు అపోహలు నమ్మవద్దు



**సీతారామపురం జూన్ 13 ప్రభాతవార్త :** సీతారామపురం మండల కేంద్రంలోని గ్రంధాలయం మూసివేతను నిరసిస్తు ఇటీవల పాఠకులు గ్రంధాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే అయితే ఈవిష యం ను టిడిపి మండల మాజీ కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు నెల్లూరు జిల్లా గ్రంధాలయ చైర్‌పర్సన్ మేకపాటి శాంతకుమారి దృష్టికి తీసుకొని వెళ్ళగా సీతారామపురంలోని గ్రంధాలయం మూసి వేతకు ఎటువంటి చర్యలు తీసు కోవడం లేదని సమన్వయ లోపం కారణంగా గ్రంధాలయ మూసి వేస్తున్న ట్లు ప్రచారం జరిగిందని గ్రందాలయం మూసి వేస్తున్నట్లు వస్తున్న ప్రచా రాన్ని అపోహలను ప్రజలు నమ్మవద్దని ఆమె తెలిపినట్లు ప్రభాకర్‌రాజు తెలిపారు. అతిత్వరలోనే మేకపాటి శాంతకుమారి సీతారామపురంలో పర్యటించి గ్రంధాలయానికి కావలసిన మౌళిక వసతులు సదుపాయాలను అందించి గ్రంధాలయాన్ని అతి సుందరంగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు తెలిపారు.

## రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న అగ్రికల్చర్ జె.డి సత్యవాణి



**బుచ్చి జూన్ 13 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వవ్వేరు సొసైటీ బ్యాంకులోని యూరియా గౌడౌన్‌ను జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి పరిశీలి ంచారు. ఈ సందర్బంగా ఆమె రైతులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరంఆమె మాట్లాడుతు జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సి న అవసరం లేదని అన్నారు. జిల్లాకు 31 వేల టన్నుల యూరియా దిగుమతి అయిందని ఆమె తెలిపారు. అందులో 11 వేల టన్నుల యూరియాను రైతులకు ఇవ్వడం జరిగింది. 20 వేల టన్నుల యూరియా స్టాక్ ఉందని ఆమె తెలిపారు. 1,350 టన్నుల యూరియా బుచ్చి మండలంలో రైతులకు అందించడం జరుగుతుందని చెప్పారు. యాప్ రైతులు అపోహలు పెట్టుకోవాల్సి న అవసరం లేదని చెప్పారు. కొత్త విధానం కాబట్టి రైతుకు అలవాటు పడాల్సి న అవసరం ఉందని అన్నారు. చెరువుల్లో,ప్రభుత్వ భూముల్లో,సాగు చెస్తున్న రైతులు వ్యవసాయ అదికారులను వివరాలతో సంప్రదిస్తు యాప్లోఎంట్రీ చేయించి వారికి కూడా యూరియా అందిస్తారని తెలిపారు. కొన్ని టెక్నికల్స్ సమస్యల వల్ల ఇబ్బందులు తలత్తెయని దీంతో యూరియా పంపీణి ఆలస్యమైందని చెప్పారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు నేడు యూరియాను తరలిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ,ఏడి అనిత,బిజెపి మండల అద్యక్షులు మనోహర్‌రెడ్డి, ఎం శ్రీహరి శేషయ్య ఉన్నారు.

## అంతిమ యాత్ర ఖర్చులకు 5 వేలు ఆర్ధికసహాయం



**బుచ్చి జూన్ 13 ప్రభాతవార్త** జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం వారి ఆద్వర్యంలో దాతల సహాకారంతో అంతిమయాత్రపథకం ద్వారా మినగల్లు గ్రామానికి చెందిన మన్నెం సుజాతకు అంత్యక్రియల ఖర్చు నిమిత్తం5 వేల రూపాయాలు వారి కుమారుడు మన్నెం వెంకట శేషుకి మినగల్లు కార్యవర్గ సభ్యులు ,మినగల్లుగ్రామ దేవాంగ ఆత్మీయులు ద్వారా అందజేశారు. ఎత్తుబడి ఖర్చులు ఇచ్చినందుకు దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# యూరియా కొరత లేదు

## వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ



**బుచ్చి జూన్ 13 ప్రభాతవార్త** వవ్వేరు బ్యాంకులో రైతులకు యూరియా కొరతలేదని బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ తెలిపారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో రైతులకుయూరియా అందిస్తున్నామనిచెప్పారు. శనివారం 329 యూరియా బస్తాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయాధికారులు రైతులకు యాప్‌పైన అవగాహన కల్పిస్తున్నారని ఆమెపేర్కొన్నారు. ఆది వారం కూడా యూరియా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు .రైతులుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమెకోరారు. రైతులు యూరియా విషయంలో ఆందోళన పడవద్దని ఆమె తెలిపారు.

# స్వచ్ఛ సేవకుల వస్తున్నారు..!

## బీసీ వసతి గృహాల్లో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం



**కోట,జూన్ 13 ప్రభాతవార్త** బీసీ సంక్షేమ వసతి గృహాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారి స్తోంది. మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పఇకే హస్టల్‌కు ఇ న్వర్టర్లు ,అంద జేసింది.తాగునీటి సదుపాయామూ కల్పించింది.ఈ విద్యాసంవత్సరం నుంచి పారిశుద్ధ్యనిర్వహణ బాధ్యతలను ప్రవేటు ఏజె న్సీకిఅప్పగించేందుకు కార్యా చరణ సిద్ధంచేశారు. త్వరలోనే జిల్లాలోని వసతి గృహాలకు ఒక్కొక్కరు చొప్పున పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రభుత్వ హస్టళ్లలో నిర్వహణ సక్రమంగా ఉండదనే ఆలోచనతో విద్యార్థులను చేర్పించేందుకు తల్లి దండ్రులు వెనకాడుతుంటారు. వార్డెన్, కుక్, కమాటి వంటి పోస్టులు తప్ప పారిశుద్య నిర్వహాణకు ప్రత్యేక సిబ్బంది లేకపోవ డంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. బ్లీచింగ్, ఫినాయిల్ వంటి సామగ్రి కొనుగోలుకూ బడ్జెట్ ఇవ్వకపోవడంతో చాల చోట్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండేది.ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకే ప్రభుత్వం కృషి చేస్తోంది.ఈ నెలాఖరులోగా అన్ని ఈవిషయమై జిల్లా బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మీని ప్రభాతవార్త వివరణ కోరగా ఇంకా ఉత్తర్వులు రాలేదని ఈ నెఖారి లోపాల ఉత్తర్వులు రావచ్చుని ఆమె పేర్కొన్నారు.

ఏం చేస్తారంటే :

- సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తారు. వారు రోజువారీ విధులకు వస్తుందీ లేనిది ముఖ హాజరు ద్వారా పర్యవేక్షిస్తారు.
- సిబ్బందికి ప్రత్యేక్య యూనిఫారం ఇస్తారు.
- ఏజెన్సీ ద్వార కార్మిక చట్టాల ప్రకారం ప్రయోజనాలు అందుతాయి.
- పారిశుద్ధ్య మెరుగుకు కావాల్సిన 22 రకాల సామగ్రిని ప్రతి నెల ఏజెన్సీయే సరఫరా చేస్తుంది.

# కార్పోరేషన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

## 2026 జిల్లా స్థాయి యోగా పోటీలు

**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 13 ప్రభాతవార్త :** నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 2026 సందర్భంగా జిల్లా స్థాయి యోగా పోటీలు జూన్ 14,15,16వ తేదీల్ల కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు నెల్లూరులో నిర్వహించబడనున్నాయి. జూన్ 14న జూనియర్ విభాగం 10నుంచి 18ఏళ్ళ వారికి సోలో యోగా(ఆసనాలు మరియు ప్రాణాయామం) గ్రూప్ సంక్రోనైజ్డ్ పోటీలు. జూన్ 15న యంగ్ 19నుంచి35ఏళ్ళు, 36ఏళ్ళు పైబడిన వారికి ఆసనాలు, ప్రాణాయామం గ్రూప్ సింక్రోనైజ్డ్ యోగా పోటీలు, జూన్ 16న యోగా క్విజ్, యోగా స్లోగన్ యోగా వ్యాసరచన, యోగా గీతం యోగా షార్ట్‌ఫిల్మ్,యోగా పోటోగ్రఫి పోటీలు ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి నిర్వహించబడుతాయి. ఆసక్తిగల విద్యార్థులు, యువత, యోగా సాధకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరడమైనది. పోటీలలో విజేతులగా నిలిచిన వారికి ఆకర్షనీయమైన బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజే యబడుతాయి. జిల్లా స్థాయిలో ఉత్తమప్రతిభ కనపరచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుందన్నారు. సంప్రదించాల్సిన వారు ఎస్‌జిఎఫ్ కార్యదర్శి బి.వి.రమణయ్య 9494640191, విజయన్ స్టాఫ్ సివిపిపి యూనిట్ రిధిమా 6302452001కు సంప్రదించాలన్నారు.

# సంగం తహసిల్దారుగా ఎం.సారంగపాణి



**సంగం జూన్ 13 ప్రభాతవార్త** సంగం తహసిల్దారుగా ఎం.సారంగపాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి తహసిలా ్దరుగా ఉన్న అంబటి వెంకటేశ్వర్లు ,సిబ్బంది ఆయనను స్వాగతించారు. అనంతరం కార్యాలయం సిబ్బంది ఆయనతో పరిచయాలు చేసుకున్నారు.అనంతరంనూతనంగా బాధ్యతలు స్వీకరించి సారంగపాణి మాట్లాడుతు ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యల సాధనకు కృషి చేస్తానని అన్నారు.

# రైతు ద్రోహి చంద్రబాబు : మాజీ మంత్రి కాకాణి



**పొదలకూరు, జూన్ 13, ప్రభాతవార్త** రైతు ద్రోహి చంద్రబాబు అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పొదలకూరు మండలంలోని సూరాయపాలెం, మహమ్మదాపురం, పొదలకూరు గ్రామాలలో పర్యటించి పొదలకూరులో మీడియా సమావేశంలో మాట్లాడిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి పొదలకూరులో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పెదమల్లు రమణారెడ్డిని, రత్నా రెడ్డిని పరామర్శించిన అనంతరం ఇటీవల మృతి చెందిన లక్కు తిరుపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను, గడ్డం శ్రీధర్ రెడ్డి మాతృమూర్తి రమణమ్మ మరణించడంతో శ్రీధర్ రెడ్డిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మాజీ మంత్రి డా. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధైర్యంచెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్ల నిరసన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించామన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాల రోజు, నాటి నుంచి, నిన్నటి దినం జూన్ 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగాయన్నారు. ఈ నెల జూన్ 4, 5 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల వారీగా నిరసనలు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టో, చంద్రబాబు హామీ ఇచ్చిన బాండ్లు, విడుదల చేసిన పత్రికా ప్రకటనల తాలూకు కాపీలను నిరసన తెలిపి మంటలలో తగలబెట్టామన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ అమలు చేయలేదని ప్రజలకు వివరించామన్నారు. జూన్ 8, 9 తేదీల్లో అన్ని వర్గాల ప్రజలతో సదస్సులు నిర్వహించి, ముఖాముఖి కార్యక్రమాల ద్వారా వారి అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నామన్నారు. జూన్ 12 (నిన్న) ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల్లో వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో చేపట్టిన కార్యక్రమాలకి ప్రజల నుంచి స్వచ్ఛందంగా, ఎక్కడా లేని విధంగా విశేష స్పందన లభించిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన బోగస్ హామీలను నమ్మి తాము మోసపోయామనే వాస్తవాన్ని ప్రజలు గ్రహించారని పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు అనేక రకాల అబద్ధపు వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాడని అన్నారు. చంద్రబాబు మీద అసంతృప్తితోనే ప్రజలుపెద్ద ఎత్తున తరలి వచ్చి మా నిరసనలకు మద్దతు తెలిపారని ఆయన అన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ పై అవగాహన కలిగి ఉండాలి : ఆర్డీవో అరుణ కుమారి



**గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త** దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్)ను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్‌లు, ప్రజలు సమష్టిగా సహకరించాలని గూడూరు ఆర్డీవో అరుణ కుమారి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పురపాలక సంఘం మీటింగ్ హాల్ నందు డివిజన్‌లోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్‌లతో సర్‌కు సంబంధించి విధి విధానాలను, పాటించవలసిన నియమాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అరుణ కుమారి మాట్లాడుతూ ఓటరు జాబితా మరింత పారదర్శకంగా ఖచ్చితంగా తప్పులు లేనిదిగా అందించడమే సర్ లక్ష్యమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి ఖచ్చితమైన ఓటరు జాబితాను అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, గూడూరు పురపాలక కమిషనర్ మల్లికార్జున రావు, బిఎల్‌వోలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రమణయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, జూన్ 13 ప్రభాతవార్త :** మండలం కొనదిన్నె గిరిజన కాలనీకి చెందిన మాజీ వైస్ ప్రెసిడెంట్ కమలాపూరి రమణయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడం జరిగింది. విషయం తెలు సుకున్న కావలి నియోజకవర్గం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కొనదిన్నెలోని రమణయ్య నివాసానికి వెళ్లి పరామర్శించి అనారోగ్యానికిగల కారణాలను అడిగి తెలుసుకొని డాక్టర్ల సలహాలు సూచనలు పాటిస్తూ ఉండాలని తెలిపారు. కొనదిన్నె గిరిజన కాలనీకి మాజీఎమ్మెల్యే రావడంతో ఆయనకు స్థానికులుపూలమాలలతో ఘనస్వాగతం పలికారు.శాలువాలతో ఘనంగా సత్కరించి అభిమానాన్ని చాటుకొన్నారు. వైసిపి మండల అధ్యక్షులు వాయిల తిరుపతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూర్యఘర్ పథకం అమలులో వేగం పెంచాలి

## సీఎండీ లోతేటి శివశంకర్, ఐఏఎస్



**నెల్లూరు, జూన్ 13,ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతవిద్యుత్ పంపిణీ సంస్థ (APSPDCL) పరిధిలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలును మరింత వేగవంతం చేయాలని సంస్థఛైర్మన్‌మేనేజింగ్ డైరెక్టర్ లోతేటిశివశంకర్,ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకుసంస్థ పరిధిలో 25వేలకుపైగా సౌర విద్యుత్ వ్యవస్థల (Solar Rooftop) ఇన్‌స్టాలేషన్లు పూర్తయినప్పటికీ, వాటికి సింక్రొనైజేషన్ ప్రక్రియను వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన తెలిపారు. వినియోగదారులకు సౌర విద్యుత్ ప్రయోజనాలు త్వరి తగతిన అందాలంటే సింక్రొనైజేషన్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నేపథ్యంలో డిస్కామ్ ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఆపరేషన్ మెయింటెనెన్స్ సిబ్బంది అందరూ రేపు ప్రత్యేక దృష్టి సారించి సూర్యఘర్ కనెక్షన్లసింక్రొనైజేషన్ పనులనువేగవంతం చేయాలని సూచించారు.సంబంధిత వెండర్లతో సమన్వయం చేసుకుంటూ, అవసరమైన సాంకేతిక సహకారం అందించి, పెండింగ్‌లో ఉన్న సిం క్రొనైజేషన్‌లను పెద్ద ఎత్తున పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించి, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు."సూర్యఘర్ పథకం ద్వారా ప్రజలకు ఉచిత విద్యుత్ ప్రయోజనాలు అందించడమే మా లక్ష్యం. ప్రతి ఇన్‌స్టాలేషన్ త్వరగా సింక్రొనైజేషన్ పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తిలోకి రావాలి. అందుకోసం అధికారులు, సిబ్బంది అందరూ జట్టుగా పనిచేసి రేపు గణనీయమైన పురోగతి సాధించాలి" అని సీఎండీ శ్రీ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# క్రిస్ సిటీ నిర్మాణ పనులు చేపడుతున్న బివిఎస్‌ఆర్ కంపెనీకి చెందిన వాహనాలను అడ్డుకున్న తీగపాలెం గ్రామస్తులు

- పునరావాసం కల్పించకుండానే తొలగిస్తారా అంటూ గిరిజనుల ఆవేదన
- నష్టపరిహారం లేకుండా ఇళ్లను తొలగిస్తున్నారని ఆగ్రహం
- క్రిస్ సిటీ పనుల కోసం ఇళ్ల తొలగింపునకు యత్నం - పునరావాసం కల్పించకుండానే తొలగిస్తారా?
- బివిఎస్‌ఆర్ కంపెనీ తీరుపై భగ్గుమన్న తీగపాలెం గిరిజనులు



**చిల్లకూరు, జూన్ 13, ప్రభాతవార్త** క్రిస్ సిటీ నిర్మాణ పనులు చేపడుతున్న బివిఎస్‌ఆర్ కంపెనీకి చెందిన వాహనాలను తీగపాలెం గ్రామస్తులు అడ్డుకుని శనివారం ఆందోళన వ్యక్తం చేయడంతో ఆ సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం, చిల్లకూరుమండలం లింగవరం పంచాయతీ పరిధిలోని తీగపాలెం గిరిజనులు శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. క్రిస్ సిటీ నిర్మాణ పనుల పేరుతో ఎటువంటి ముందస్తు నోటీసులులేకుండా, పునరావాసం కల్పించకుండా తమ ఇళ్లను తొలగిం చేందుకు వచ్చిన బివిఎస్‌ఆర్ కంపెనీ వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసే వరకు పోరాడుతామని వారు స్పష్టం చేశారు.

**- నిరసన బాటలో బాధితులు..** క్రిస్ సిటీ నిర్మాణ పనులలో భాగంగా రహదారి నిర్మాణం కొరకు బివిఎస్‌ఆర్ కంపెనీ ప్రతినిధులు, అధికారులు భారీ యంత్రాలతో తీగపాలెం చేరుకున్నారు. సుమారు 14 గిరిజన కుటుంబాల ఇళ్లను ఖాళీ చేయించాలని ప్రయత్నించగా, గ్రామస్తులు ఒక్కసారిగా నిరసనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా తాము ఇక్కడే నివాసముంటున్నామని, కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేదా నష్టపరిహారం చెల్లించకుండా తమను రోడ్డున పడేయడం దారుణమని గిరిజనులు కన్నీటి పర్యంతమయ్యారు.

**- అధికారుల తీరుపై ఆగ్రహం, బివిఎస్‌ఆర్ కంపెనీ గ్రావెల్ వాహనాల అడ్డగింత** స్థానిక రెవెన్యూ అధికారులు, ముఖ్యంగా వీఆర్వో, కంపెనీకి వత్తాసు పలుకుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, వీటిని ప్రభుత్వ భూములని పేర్కొంటూ గిరిజనులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని వారు వాపోయారు. రెక్కాడితే గాని డొక్కాడని మమ్మల్ని, మా నివాసాల నుండి వెళ్లగొట్టేందుకు యత్నిస్తూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాయడం అన్యాయం అని వారు మండిపడ్డారు.

**- ముందుగానే నష్టపరిహారం చెల్లించాలి లేదా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి** మరో వైపు గత కొంతకాలంగా సదరు సంస్థకు చెందిన గ్రావెల్ టిప్పర్లు ఈ ప్రాంతం గుండా అధికంగా తిరుగుతుండటంతో నిరంతరం దుమ్ము, ధూళి సమస్యలతో వృద్ధులు, పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా 14 గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో ముందుగానే సదరు బాధిత గిరిజనులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అప్పుడే ఖాళీ చేస్తామని గ్రామస్తులు తేల్చి చెప్పారు. అధికారుల మొద్దునిద్ర వీడి, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి, గిరిజనుల హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు అండగా స్థానికులు కూడా నిరసనలో పాల్గొనడంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమకు తగిన న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ ఘటనపై స్థానిక యంత్రాంగం మరియు సంబంధిత అధికారులు స్పందించి, బాధితులకు తగిన పునరావాసం కల్పిస్తారా లేదా అనేది వేచి చూడాలి.

# మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షునిగా కొమారి శ్రీకాంత్ ఏకగ్రీవ ఎన్నిక



**తోటపల్లి గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త:** తోటపల్లి గూడూరు మండలం కోడూరు గ్రామ దేవత శ్రీ ముఖంటమ్మ ఆలయ ఆవరణలో శనివారం మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఎనిమిది గ్రామాలకు చెందిన మత్స్యకారుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో తోటపల్లి గూడూరు మత్స్యకార సం క్షేమ సమితి నూతన అధ్యక్షునిగా కొమారి శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మత్స్య కార సంక్షేమ సమితి రాష్ట్ర కోశాధికారి కాటంగారి లక్ష్మినారాయణ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తమసంస్థ మత్స్యకారుల సంక్షేమమే ప్రధానలక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. మత్స్యకారులు ఎదుర్కొం టున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొ న్నారు. అలాగే మత్స్యకార కుటుంబాల ఆరోగ్య పరిస్థితుల మెరుగుదలకు కూడా సంస్థ విశేషంగా సేవలం దిస్తోందని వివరించారు. తోటపల్లి గూడూరు మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షునిగా కొమారి శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషకరమని లక్ష్మినారాయణ అన్నారు. ఆయన నాయకత్వంలో సమితి మరింత బలోపేతం అవుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షుడు కొమారి శ్రీకాంత్ మాట్లా డుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో మత్స్యకారుల సమస్యలపరిష్కారం,సంక్షేమం, అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడురమేష్, జిల్లా కార్యదర్శి భక్తాన్ని రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ముత్యాల సుధాకర్, ఆవుల శ్రీహరి, కంజి అంజయ్య, రామకృష్ణతో పాటు పలువురు నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

## - మహిళలకు చీరలు, పసుపు కుంకుమల పంపిణీ



**తోటపల్లి గూడూరు, జూన్ 13, ప్రభాతవార్త** మండలం తోటపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్, శ్రీ ఆంజనేయ స్వామి భక్తుడు కోసూరు నారాయణ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైదరా బాద్‌కు చెందిన విజయ్ కుమార్, ఆయన సతీమణి భాను తిలకం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం 100 మంది మహిళలకు పసుపు, కుంకుమలు, చీరలను పంపిణీ చేశారు. పూజల అనంతరం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్య క్రమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కోసూ రు నారాయణ కుటుంబంతో ఉన్న స్నేహపూర్వక అనుబంధం కారణంగా ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు. గ్రామస్తులు, భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు. కోసూరు నారాయణ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తాను కోరిన వెంటనే విజయ్‌కుమార్, భాను తిలకందంపతులు సహకరించారని, ప్రతిష్ఠా కార్యక్రమానికి హాజరు కాలేకపోయినా ఇప్పుడు స్వామివారికి పూజలు నిర్వహించి వస్త్రదానం, అన్నదానంచేయడం ఆనందంగా ఉందన్నారు.విజయ్‌కుమార్, భానుతిలకం, వారి కుమారులు పవన్ కుమార్, యశ్వంత్ కుమార్, జి. సుమంత్, ఆయన సతీమణి భాగ్యతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి పోలీసుల నోటీసులు



**కావలి, జూన్ 13 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే, వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి పోలీసులు నోటీసులు అందజేయడం జరిగింది. ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చేసిన రాజకీయ విమర్శల నేపథ్యంలో కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒకటవ పట్టణ ఎస్ఐ సుమన్ మాజీ ఎమ్మెల్యేను విచారణకు హాజరు కావాలని వారి ఇంటివద్దకు వెళ్ళి నోటీసులు జారీచేశారు. సోషల్‌మీడియాలో అసభ్యకరంగా మానాయకులపై పోస్టుల పెట్టిన వారిపై ఫిర్యాదు చేస్తే ఆ పిర్యాదులను మాత్రం తీసుకోకుండా రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా మా మీద కేసు పెట్టి వేధిస్తు న్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు అన్ని గమనిస్తూ ఉన్నారని సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

# ఆధార్ అనుసంధానంతోనే అన్నదాత సుఖీభవ: ఏఓ సుచేంద్రప్రసాద్



**కోట, జూన్ 13 ప్రభాతవార్త** ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి ఏడాది రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.14 వేలు అందజేస్తుంది. ఇందులో రాష్ట్రప్రభుత్వం రూ.8 వేలు, కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6 వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నాయి. అర్హులైన కొంత మంది వివిధ కారణాలతో లబ్ధి పొందలేకపోతున్నారు. ఇటువంటి వారికి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందని కోట మండల వ్యవసాయాధికారి ఎం.సుచేంద్రప్రసాద్ చెప్పారు. ఆయన శనివారం 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ రైతు బ్యాంకు ఖాతా నంబర్‌కు ఆధార్ అనుసంధానమైతే చాలు అర్హులుగా పరిగణించి సహాయం నేరుగా వారికి జమ చేసేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

**ఇలా చేయాలి** బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ కాని రైతులు 1బి, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో స్థానిక స్వర్ణ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వీటిని గ్రామ రెవెన్యూ అధికారి, తహశీల్దార్ నిర్ధారించాక అనుసంధాన ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం ఆటోమేటిక్‌గా ఆ రైతు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారు. గత ఏడాది డబ్బులు జమ అయిన వారు ఇప్పుడు చేయాల్సిన పనిలేదు. ఇంతకుముందు ఆదాయ పన్ను చెల్లించి, ఇప్పుడు చెల్లించని వారు ఇకేవైసి సమస్యలు, ఇతర కారణాలతో లబ్ధి పొందని అన్నదాతలు పూర్తి వివరాలు దానికి సంబంధించిన ధ్రువపత్రాలు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయాధికారి కోరారు.

# కార్డన్ అండ్ సెర్చ్లో 26 బైకుల స్వాధీనం

## పోలీసుల తనిఖీలు.. భద్రత, సైబర్ నేరాలపై అవగాహన





**విడవలూరు, జూన్ 13 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా ఇన్చార్జి, ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేరకు, జిల్లా ఎస్పీ అజిత వెజెండ్ల మార్గదర్శకాలు, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సూచనలతో సీఐ దుర్గాప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం రాంనగర్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్‌నిర్వ హించారు. తనిఖీల్లో పత్రాలు లేని 26 ద్వి చక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి పత్రాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చున్నారు. మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిం చారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో బాధితులను గుర్తించిన వారు స్వచ్ఛందంగా సమీప వైద్యశాలకు తరలించి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సీఐ సూచించా రు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్, కోటిరెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతగా ఎస్ఐఆర్ విధులు చేపట్టాలి



**కోవూరు, జూన్ 13ప్రభాతవార్త :** కోవూరు మండలం లోని అన్ని గ్రామాలకు సంబంధించిన బూత్ లెవల్ అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇచ్చిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు ఎన్నికల కమిషన్‌కు వచ్చిన ఎస్ఐఆర్‌కు సంబంధించిన మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి బూత్ లెవల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ మెటీరియల్స్‌ను ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందజేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, తదితరులు ఉన్నారు.

# వీపీఆర్ విద్య దేవాలయంతో సమానం



**కోవూరు, జూన్ 13 ప్రభాతవార్త** : వీపీఆర్ విద్య తమకు దేవాలయంతో సమానమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ విద్య పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్కూల్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ విద్యను చదువుకునే ఆర్థిక స్థోమత లేని ప్రతిభ గల విద్యార్థుల కోసమే స్థాపించారన్నారు. ఇంట్లో పేదరికం ఉన్నా ప్రతిభ లేకుండా ఏ పేద బిడ్డ వెనుకబడి పోకూడదనే ఆలోచనతో ఈ వీపీఆర్ విద్య మొదలైందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు తమ పాఠశాల నుంచే అడుగులు పడాలన్నదే తమ ప్రధాన ఆశయమన్నారు. వీపీఆర్ విద్య 2016లో స్థాపించామని, పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని విద్యా సామగ్రి, బస్సు సౌకర్యం మధ్యాహ్న భోజనం వంటి వసతులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 8 బ్యాచ్‌లు విద్యార్థులు 10వ తరగతి పూర్తి చేసుకున్నా రన్నారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ ఏడాది అత్యధికంగా 594 మార్కులు వచ్చాయన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఉన్నత చదువులు కూడా తాము వీపీఆర్ ఫౌండేషన్ తరపున చదివిస్తున్నామన్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌లకు, సోషల్ మీడియాకు వీలైనంత వరకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

# అమృత్ పథకం-1లో జరిగిన అవినీతికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు : ఎమ్మెల్యే





**కావలి, జూన్ 13 ప్రభాతవార్త :** అమృత్ పథకం-1 పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయని ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ళు పూర్తి చేసుకొన్న సందర్భంగా చేపట్టిన సమస్య మీది, పరి ష్కారం నాది కార్యక్రమంలో భాగంగా కావలి ఎమ్మెల్యే శనివారం పట్టణంలోని 15వ వార్డులో కార్యక్రమాన్ని నిర్వహించి కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఎమ్మెల్యే సంబందిత శాఖల అధికారులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలను పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం ముసునూరు బాలాజీ నగర్‌లో రూ.20లక్షలతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. రాష్ట్రంలో సిఎం చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ళలోని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దూసుకెలుతోందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. 20కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరడం జరిగింది. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వా నించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి సీనియర్ నాయకులు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబునాయుడు, మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి, వార్డు నాయకులు, సింగమనేని హరిబాబు, బిట్రగుంట వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదరణ కేంద్రంలో అన్నదానం




**బిట్రగుంట జూన్ 13 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఆదరణ కేంద్రంలో శనివారం రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ మెతుకురాజేశ్వరి ఆధ్వర్యంలో మెతుకు మెతుకు రమేష్ బాబు జయంతి సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో , మెతుకు ఓంశ్రీ గరు, పఠాన్ షకీల్ తదిత రులు పాల్గొన్నారు